భూమికి బలం.. రైతుకు లాభం

- అన్నదాతలకు అండగా నిలుస్తున్న పీఎండీఎస్ విధానం
- 31 రకాల విత్తనాలతో కూడిన 20 కేజీల కిట్లు అందజేత
- నేలలో నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెంపుదల
- తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడులు


పీఎండీఎస్ కిట్లతో సాగు చేసిన పొలాన్ని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు


సిద్ధం చేసిన పీఎండీఎస్ కిట్లు



పీఎండీఎస్ కిట్లలో విత్తనాలను ప్రదర్శనకు పెట్టిన వ్యవసాయ శాఖ సిబ్బంది

నకరికల్లు: అన్నదాతలు సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో ఖరీఫ్, రబీ సాగు చేయబోయే రైతులకు అధిక దిగుబడులు సాధించేందుకు, చీడపీడలు ఆశించకుండా ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్(పీఎండీఎస్) విధానం కొండంత అండగా నిలుస్తుంది. పీఎండీఎస్ అంటే తొలకరి వర్షాలకే ముందే విత్తనాలు నాటే పద్ధతి. ఇది ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించడం. ఈ విధానంలో పంటలు పండిస్తే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చు, నీటి వృధాను కూడా అరికట్టవచ్చు. భూమికి బలం చేకూరుతుంది. ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కిట్లను రూపొందించి రైతులకు విక్రయిస్తున్నారు. 31 రకాల విత్తనాలు కలగలిపి 20 కేజీల కిట్లను తయారు చేసి రైతులకు అందజేస్తున్నారు. దీని ద్వారా రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లిస్తున్నారు.

కిట్‌లో లభ్యమయ్యే విత్తనాలు

పీఎండీఎస్ పేరుతో ప్రత్యేకంగా రూపొందించిన కిట్లలో 31 రకాల విత్తనాలు ఉంటాయి. పప్పుదినుసులు, చిరుధాన్యాలు, నూనెగింజలు, ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి, సుగంధద్రవ్యాలు, పచ్చిరొట్ట విత్తనాలు కలిపి కిట్లను రూపొందించి అందిస్తారు. జొన్నలు, సజ్జలు, రాగులు, పిల్లిపెసర, అలసందలు, నువ్వులు, ఉలవలు, జనుము, జీలుగ, శనగలు, బొబ్బర్లు, మొక్కజొన్న, కందులు, మినుము, గోగులు, ఆవాలు, ఆముదం, సార, బీర, దోస, కాకర, చుక్కకూర, తోటకూర, పాలకూర, మెంతులు, ధనియాలు, గోరుచిక్కుడు, బెండ, ముల్లంగి, బీన్స్ లాంటి 31 రకాల విత్తనాలు పీఎండీఎస్ కిట్ ద్వారా అందజేస్తున్నారు. 20 కేజీల కిట్‌ను రూ.1,600 విక్రయిస్తున్నారు.

భూమికి అదనపు ప్రయోజనం

ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ విధానంలో ప్రధాన పొలం సిద్ధం చేసిన నాటి నుంచి బీజామృతంతో విత్తన శుద్ధి చేసి ఘనజీవామృతం, ద్రవజీవామృతం, గ్రోత్‌ప్రమోటర్‌లు, అంతర పంటలు వేయడం ద్వారా భూమిలో స్వభావం మారి వేయబోయే పంటలకు అదనపు లాభాలను తెచ్చిపెడుతుంది. మొక్క ఆకుగరుకుగా మారి పంటకు పురుగు ఆశించదు. ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ విధానం ద్వారా మొక్కలకు భాస్వరం, పొటాషియం, కార్బన్, కాల్షియం, మెగ్నీషియం, బోరాన్, ఐరన్, జింక్ లాంటి పోషకాలు అందుతాయి. ఏటా ఖరీఫ్‌కు ముందు పీఎండీఎస్ వేయడం ద్వారా భూమి సారవంతంగా మారడంతో పాటు నీటిని నిల్వచేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. ఎకరాకు 20 కేజీల విత్తనాలు చల్లడం ద్వారా 20 టన్నుల ఎరువుకు సమానమైన బలాన్ని భూమికి అందిస్తుంది. తొలకరి వర్షాలు పడ్డాక ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు, సాధారణ పద్ధతిలో సాగు చేసే రైతులు ముందస్తుగా కిట్లను చల్లడం ద్వారా భూమికి సారం పెరిగి అధిక దిగుబడులు, పశువులకు మేతను పొందవచ్చు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని విధాలుగా అన్నదాతకు అండగా ఉండేందుకు ప్రతిష్టాత్మకంగా 2021 నుంచి రైతులకు పీఎండీఎస్ కిట్లు అందించారు. రైతులను లాభసాటి వ్యవసాయం వైపు మళ్లించి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సంప్రదాయ వ్యవసాయానికి సాంకేతికతను జోడించి రైతులను ప్రోత్సహించారు. దీంతో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

అదనపు లాభాలు పొందవచ్చు



పీఎండీఎస్ కిట్లను తొలకరి వర్షాలు పడ్డాక భూమిలో చల్లడం ద్వారా రైతులు అదనపు లాభాలు పొందవచ్చు. నేలలో సూక్ష్మజీవులు అధికమవ్వడం ద్వారా కర్బన శాతం పెరుగుతుంది. ప్రధాన పంటలకు కావలసిన పోషకాలు నేల నుంచే లభ్యమవుతాయి. కలుపు తక్కువగా రావడంతో పాటు భూమి గుల్ల బారుతుంది. నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం కలిగి ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటుంది. వరికి ఎకరాకు ఒక కిట్, మిర్చి తదితర పంటలకు ఎకరాకు 3 కిట్ల చొప్పున వేసుకోవచ్చు. పల్నాడు జిల్లాలో ఇప్పటికే 42 వేల ఎకరాలకు సరిపడా కిట్లను పంపిణీ చేశాం. మరో 40 వేల ఎకరాలకు కావసిన కిట్లను పంపిణీ చేసే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

– అమలాకుమారి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్

క్లుప్తంగా

ముప్పాళ్ళ తహసీల్దార్‌గా నగేష్



ముప్పాళ్ళ: ముప్పాళ్ళ తహసీల్దార్‌గా కే నగేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా గురజాల తహసీల్దార్‌గా పని చేస్తూ ఆయన ముప్పాళ్ళకు వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పెండింగ్ అర్జీలు లేకుండా పని చేయాలన్నారు. రైతులకు, విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందించాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఆర్ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల వీఆర్వోలు తహసీల్దార్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు



ముప్పాళ్ళ: మండల వ్యవసాయశాఖాధికారిగా పనిచేస్తూ బదిలీపై జిల్లా వనరుల కేంద్రం కార్యాలయంకు వెళుతున్న ఎం.అరుణకు అభినందన కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమంలో ప్రస్తుత మండల వ్యవసాయ శాఖాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి పాల్గొని విధుల పట్ల అంకిత భావంతో పనిచేస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. ఐదేళ్ల పాటు రైతులకు దగ్గరగా ఉంటూ అన్ని వర్గాల వారి నుంచి మన్ననలు పొందటం అభినందనీయమన్నారు. ప్రజల నుంచి లభించే మన్ననలే అధికారుల పనితీరును తెలియజేస్తాయన్నారు. ఈ సందర్భంగా అరుణను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల వీఏవోలు పాల్గొన్నారు.

రైతులు ఈ కేవైసీ నమోదు చేసుకోవాలి

మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు

నకరికల్లు: పీఎం కిసాన్ పథకం పొందేందుకు ఈ నెల 18వ తేదీలోగా ఈ కేవైసీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని దేచవరం గ్రామంలో ఈ కేవైసీ నమోదు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకానికి 9,701 మంది రైతులను అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటివరకు ఈ కేవైసీ నమోదు చేసుకోని రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి సత్వరమే నమోదు చేసుకోవాలని సూచించారు. రైతుల తమ పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్, ఆధార్ జిరాక్స్‌లతో రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి ఫార్మర్ ఈ కేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ



అందుకూరు(క్రోసూరు): మండలంలోని అందుకూరు ఎంపీయూపీ పాఠశాలలో సోమవారం సర్వేపల్లి రాధకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.తిరుమలరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాళ్లూరి శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్ట్‌లు అందజేశారు. అనంతరం తల్లికి వందనం నగదు విద్యార్థుల ఖాతాలకు జమ అయినందున ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



పెదకూరపాడు: ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యావంతులై అత్యున్నత శిఖరాలను చేరుకోవాలని టీడీపీ జిల్లా కార్యదర్శి అర్తిమళ్ల రమేష్ విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల్లో దాగిన ప్రతిభను ప్రోత్సహించేలా కూటమి ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్స్ (మెరిసే తారలు) అవార్డులు అందుకున్న సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు చేగు మోహన వెంకట అశ్రిత(589), గుంటూరు అమూల్య(569)లు అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి సిస్టర్, ముఖ్య నేతలు గుడిపూడి బాబు, అజిముల్లా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోండి

ఎంపీపీ స్వర్ణమ్మభాయ్


కొత్తపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అచ్చంపేట: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అనేక సేవా కార్యక్రమాలను చేపట్టిందని, ముఖ్యంగా చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య, బాలింతలు, తల్లులకు ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారాన్ని అందిస్తుందని ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మభాయ్ అన్నారు. మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు చదువు పట్ల ఆశక్తి కలుగజేయడం, చదువుకు పునాది వేయడం, ఆటపాటలతో కూడిన విద్యను అందించడం జరుగుతుందన్నారు. అదే విధంగా తల్లులు, బాలింతలు ఏ విధమైన ఆహారాన్ని తీసుకోవాలి, పుట్టబోయే చిన్నారులకు ఏ విధంగా జన్మనివ్వాలి అనే విషయాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.మాణిక్యం, సర్పంచ్ అయితం రాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

వైభవంగా దేవతామూర్తుల ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు


స్వామి వారి కల్యాణంలో భక్తులు

అచ్చంపేట: మండలంలోని పెదపాలెంలో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి, నాభిశిల(బొడ్రాయి) భద్రకాళీ సమేత వీరభద్రేశ్వరస్వామి, గ్రామ దేవతలు, సుబ్రమణ్యేశ్వరస్వామి, అష్టనాగ సహిత మానసాదేవి, నవగ్రహాలు ప్రతిష్టా ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేద స్వస్తితో గ్రామ ప్రదక్షిణ, తోరణ బంధన, గో పూజ, విఘ్నేశ్వర పూజ, వైదిక పుణ్యాహవాచనం, రక్షాబంధనం, దీక్షధారణ, పంచగవ్య ప్రాశన, అఖండ దీపస్థాపన వంటి కార్యక్రమాలు చేపట్టారు. రుద్రహోమం చేశారు. భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. పలువురు దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. గ్రామస్తులు భజన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యంలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాటిబండ్ల వెంకటరామయ్య, నెల్లూరి చంద్రబాబు, నెల్లూరి చిన వెంకటయ్య, పాటిబండ్ల బాపిరాజు, చిరుమామిళ్ల నరసింహారావు, సర్పంచ్ నెల్లూరి హరిబాబు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, నారాయణ, పానయ్య, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద రహదారి పరిశీలన


తహసీల్దార్ చక్రవర్తితో మాట్లాడుతున్న క్రిస్టియన్‌పేట కాలనీ వాసులు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు గ్రామంలో వివాదాస్పద రహదారిని సత్తెనపల్లి తహసీల్దారు కేఎస్ చక్రవర్తి సోమవారం పరిశీలించారు. ఈ నెల 8న అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు తన స్వార్థం కోసం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని తొలగించేందుకు కుట్రపన్ని ఆ విగ్రహం వద్ద నుంచి క్రిస్టియన్‌పేట కాలనీలోకి వెళ్లే రహదారిని మూసేసి మరో వైపు రహదారి ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడు. దీనిలో భాగంగా మూడు లారీల్లో మట్టిని తీసుకొచ్చి అన్‌లోడ్ చేయడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అంతేగాక ఈ నెల 13న క్రిస్టియన్‌పేట కాలనీ వాసులు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ క్రమంలో సోమవారం తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి లక్కరాజుగార్లపాడు గ్రామాన్ని సందర్శించగా క్రిస్టియన్‌పేట కాలనీ వాసులు రహదారి ప్రాధాన్యతను ఆయనకు వివరించారు. పూర్వీకుల నుంచి ఈ రహదారి ఉందని, ఇక్కడ అంబేడ్కర్ పేరుతో లైబ్రరీ ఏర్పాటు చేసుకోవాలని ప్రయత్నిస్తున్న క్రమంలో నంది విగ్రహాల పేరుతో రహదారిని పూర్తిగా మూసివేసేందుకు ఓ వ్యక్తి స్వార్థంతో ప్రయత్నిస్తున్నాడని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై తహసీల్దార్ చక్రవర్తి మాట్లాడుతూ రహదారి మూసివేయడం జరగదని, మరోసారి ఆర్డీవో జీవీ రమణాకాంతరెడ్డి కూడా సందర్శిస్తారని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆయనతో పాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి

ఎంఈవోలు శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు


భవిత కేంద్రంలోని ఫిజియోథెరపీ క్యాంపులో డాక్టర్ కె.కుమారి

సత్తెనపల్లి: పట్టణంలోని వెంగళరెడ్డినగర్‌లోని భవిత కేంద్రంలో ప్రతి సోమవారం జరిగే ఫిజియోథెరపీ క్యాంపు సేవలను ప్రత్యేక అవసరాల పిల్లలు వినియోగించుకోవాలని ఎంఈవో-1 ఏ శ్రీనివాసరావు, ఎంఈవో-2 ఏ రాఘవేంద్రరావు అన్నారు. పట్టణంలోని వెంగళరెడ్డినగర్ భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ క్యాంపు సోమవారం నిర్వహించారు. ఈ క్యాంపును ఎంఈవోలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలను ప్రతి సోమవారం జరిగే ఫిజియోథెరపీ క్యాంపుకు తీసుకొని వచ్చి వారి సేవలు వినియోగించుకోవడం వల్ల వారిలో గణనీయమైన మార్పు వస్తుందన్నారు. అంతేకాకుండా మండల పరిధిలోని ఫిజియో థెరపీ, వినికిడి లోపము, ఆటిజం, ఏడీహెచ్డీ వంటి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు భవితా కేంద్రం సేవలను వినియోగించుకోవాలని కోరారు. క్యాంపులో భవిత కేంద్రం రిసోర్స్ టీచర్స్ ఏవీ శ్రీనివాస్, విజయ్ కుమారి, ఫిజియోథెరపీ డాక్టర్ కె.కుమారి, ఎంపీపీ ఎస్వీఆర్ నగర్ హెచ్ఎం బెల్లంకొండ నాగ సాయి ప్రసాద్, పట్టణం, మండల పరిధిలోని ప్రత్యేక అవసరాల పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

నవధాన్యాల సేద్యంతో భూమికి జీవ వైవిధ్యం

జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు సైదయ్య


పీఎండీఎస్ పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బెల్లంకొండ: నవధాన్యాల పంటలను సాగు చేయడం వలన భూమికి జీవవైవిధ్యం పెరిగి ప్రధాన పంటకు కావాల్సిన సూక్ష్మ పోషకాలు అందుతాయని జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు సైదయ్య తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ విధానంలో రైతు చింకా నరసింహారావు పీఎండీఎస్ విత్తనాల సాగు చేపట్టిన పంట పొలంలో పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో పంట దిగుబడులను పెంచేందుకు, నేలలో సూక్ష్మజీవులు వృద్ధి చెందడానికి, పోషకాలు తగిన మోతాదులో పెరగడానికి, భూమి వేసవి తాపాన్ని తట్టుకుని ఏడాది అంతా పైరును పెంచేందుకు నవధాన్య సాగు విధానమే ఉత్తమమన్నారు. నవధాన్య పంటలుగా పచ్చిరొట్ట, పప్పుజాతి, నూనె జాతి, సుగంధ జాతి, ధాన్యపు, తీగ, పూల జాతి రకాలను ఎంచుకోవాలన్నారు. మే, జూన్ నెలల్లో వచ్చే తొలకరి వర్షాలకు నేలను దుక్కి దున్ని ఎకరాకు 13 కేజీల నవధాన్య పంటలు సాగు చేయాలన్నారు. విత్తనాలు వెదజల్లి 40 నుంచి 50 రోజుల తరువాత పశువుల మేత కోసం వదలాలని లేదా భూమిలో కలియదున్నాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అనంతలక్ష్మి, సావిత్రి, మాధవి, శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ ధ్యేయం ప్రజా సంక్షేమం

రాష్ట్ర ఎంపీపీల సంఘ అధ్యక్షుడు హనుమంతరావు

అచ్చంపేట: బీజేపీ ధ్యేయం అభివృద్ధి, ప్రజా సంక్షేమం అని రాష్ట్ర ఎంపీపీల సంఘ అధ్యక్షుడు మేకల హనుమంతరావు అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ అధికారం చేపట్టి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక సాయిబాబా కల్యాణ మండపంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడు పడగడ్ల లక్ష్మాచారి అధ్యక్షత వహించారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఆర్థిక పరంగా, రక్షణ పరంగా, ఇరుగుపొరుగు దేశాలలో మన దేశ గౌరవాన్ని, భారత మహిళా సిందూర విలువను, హైందవ శక్తి జ్ఞానంతో భారత శక్తిని ప్రపంచ దేశాలకు తెలియజేశారన్నారు. కార్యక్రమంలో మాదిపాడు మాజీ సర్పంచ్ వల్లభనేని వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు పుల్లారావు, తిరుపతి స్వామి పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి


తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న వీఆర్‌ఏలు


తహసీల్దార్ డానియేల్‌కు వినతిపత్రం అందిస్తున్న వీఆర్ఏ సంఘ నాయకులు, వీఆర్ఏలు

రాజుపాలెం: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దారు దుర్గేష్‌రావుకు మండల సీఐటీయూ అధ్యక్షుడు ఎం.పిచ్చిరెడ్డి, వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు చౌటపాపాయపాలెం వీఆర్ఏ సంజీవరావు, వీఆర్ఏ కోటేశ్వరరావులు సోమవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, అర్హత ఉన్న వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. ఏళ్ల తరబడి నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా గుర్తించాలని అటెండర్, నైట్ వాచ్‌మెన్‌లుగా ప్రమోషన్ ఇవ్వాలని, అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని అన్నారు. జీతాలు పెంచాలని కోరారు. ఈ డిమాండ్‌లు అన్నీ పొందుపరుస్తూ వినతి పత్రాన్ని తహసీల్దారుకు అందజేశారు.

అమరావతి: వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వీఆర్‌ఏలు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 నెలలు గడిచినా వీఆర్‌ఏల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు 8 సంవత్సరాలుగా జీతాలు పెరగలేదని అన్నారు. వీఆర్‌ఏలకు పే స్కేలు అమలు చేయాలని ప్రభుత్వ పెద్దలకు, ఉన్నతాధికారులకు వినతులు ఇచ్చినా లాభం లేదన్నారు. అర్హత ఉన్న వీఆర్‌ఏలు వీఆర్వో ప్రమోషన్ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారని, నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ డానియేల్‌కు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు బి.సూరిబాబు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ట్రెజరీ అధికారి కుమార్



పెదకూరపాడు: పెన్షనర్ల సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని పెదకూరపాడు నూతన ట్రెజరీ అధికారి బీఆర్‌కే కుమార్ అన్నారు. సోమవారం ఉదయం పెదకూరపాడు ఉప ఖజానా కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం నాయకులు, కార్యాలయ సిబ్బంది ఆయనను సత్కరించారు. సిబ్బంది, సభ్యుల సహకారంతో అన్ని పనులు పూర్తి చేస్తానని కుమార్ తెలిపారు. సత్తెనపల్లి నుంచి బదిలీపై వచ్చిన కుమార్‌కు తొలుత సీనియర్ అకౌంటెంట్ మధుబాబు, ఆఫీస్ సబార్డినేట్ మనీష్ బాబు, శ్రీవల్లి స్వాగతం పలికారు. కార్యక్రమంలో అమరావతి, పెదకూరపాడు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఎస్.నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు వై.సుబ్బారావు, మాజీ అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, కోశాధికారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు వీరయ్య, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

21న యోగాశ్రమంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

అమరావతి: ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు యోగాశ్రమ వ్యవస్థాపకుడు ధాన్యకటక బుద్ధ విహార ట్రస్టు చైర్మన్ వావిలాల సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 21వ తేదీ శనివారం ఉదయం యోగాశ్రమ సభ్యులచే యోగాసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అలాగే సాయంత్రం నెలరోజుల పాటు జరిగిన యోగాంధ్ర కార్యక్రమాలలో పల్నాడు జిల్లా స్థాయిలో నిర్వహించిన ఆసనాలు, ప్రాణాయామాలు, సూర్య నమస్కారాల పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యోగాశ్రమ సభ్యులు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొనాలని కోరారు.

పెరికపాడులో దైవ సేవకుల సదస్సు



క్రోసూరు : క్రోసూరు మండల లార్డ్ జీసస్ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో దైవ సేవకుల సదస్సు పెరికపాడు గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ సువార్తకులు, వాక్యోపదేశకులు గుడివాడ పాస్టర్ జడ జాన్‌రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాన్‌రాజు మాట్లాడుతూ సేవకుడికి ఉండవలసిన ఏడు అంశాల గురించి వివరించారు. మండలంలోని దైవ సేవకులు ఐక్యతగా ఉండాలని సూచించారు. క్రీస్తు గురించి పలు రకాల అంశాలను ప్రస్తావించారు. ప్రతి ఒక్కరూ దేవునికి దగ్గరగా ఉండి, సమాధానం, నీతి కలిగి ఉండాలని, శాంతి మార్గమును ఆచరించాలని ఆయన సందేశం ఇచ్చారు. పాస్టర్‌ను సంఘస్థులు శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల లార్డ్ జీసస్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ పౌలు, సెక్రటరీ జడ నాగరాజు, మాజీ ప్రెసిడెంట్ దివాకర్ సీయోను బాబు, సేవకులు, సంఘస్థులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించాలి

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసరావు



అచ్చంపేట: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించాలని పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం డిప్యూటీ తహసీల్దారుకు వినతి పత్రం అందచేశారు. ముందుగా గ్రామంలో ప్లకార్డులతో హామీలు నెరవేర్చాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఇళ్లు లేని పేదలందరికీ నివేశన స్థలాలు కేటాయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నిరుపేద ప్రజల హక్కులను పరిరక్షణకు సీపీఐ నిరంతరం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో మహిళలు, సీపీఐ మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌బుజ్జి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం తాగొద్దని మందలింపు.. యువకుడు ఆత్మహత్య

సత్తెనపల్లి: మద్యం తాగవద్దని మందలించినందుకు యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ఫణిదరం గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఫణిదరం గ్రామానికి చెందిన ఉయ్యాల సాంబశివరావు (23)ను ఈ నెల 4న మద్యం తాగవద్దని తల్లి మందలించడంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హుటాహుటిన చికిత్స నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుని భార్య ఇటీవల పుట్టింటికి వెళ్లింది. సాంబశివరావు మృతిపై సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.